క్లుప్తంగా

డైయింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

మంగళగిరి: పట్టణంలోని డైయింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇందులో నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం.ఎల్. నరసింహారావు, గౌరవ అధ్యక్షుడిగా మొసలి ఫకీరు, ఉపాధ్యక్షులుగా యడ్ల శిదయ్య, గుండాబత్తుల నాగేశ్వరరావు, దొంతా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్టా కృష్ణ, సహాయ కార్యదర్శులుగా శొంఠి సుధాకర్, జూపల్లి సహదేవుడు, కర్నాటి శ్రీనివాసరావు, కోశాధికారిగా దారాదుల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ నాస్తిక మేళాను విజయవంతం చేయాలి

మంగళగిరి : నిడమర్రులోని చార్వాకాశ్రమంలో ఈ నెల 8,9 తేదీల్లో 33వ జాతీయ నాస్తిక మేళా నిర్వహించనున్నట్లు నాస్తిక సమాజం నాయకులు స్టాలిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాస్తిక సమాజమంతా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారం



తాడేపల్లి రూరల్: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ బుధవారం ప్రజా సంఘాల నాయకులు తాడేపల్లిలోని బోసుబొమ్మ సెంటర్, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, కట్ట మేరి పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

రాజుపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

సమీక్ష లేకుండా ముగిసిన పాలకవర్గ సమావేశం

తాడికొండ: తాడికొండలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సమీక్ష నిర్వహించకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ముగించారు. ప్రతి 90 రోజులకు ఒకసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాలని, అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కేవలం హాజరుకే సమావేశం పరిమితం చేసినట్లు ఎంపీడీవో కె. సమతా వాణి తెలిపారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ నాజరుపేటకు చెందిన గొంది బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జూపల్లి వేణు, అతని స్నేహితుడు రాము గత నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో వేణు బసవయ్య గొంతుపై కత్తితో పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

దేవికారాణికి కవితా పురస్కారం

9న ఖమ్మంలో ప్రదానం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రాసిన 'అద్భుతం' కవితకు జాతీయ కవితల పోటీల్లో పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని సాహితీ సంస్థ 'అక్షరాల తోవ' ఇటీవల అద్భుతం అనే అంశంపై జాతీయ కవితల పోటీలను నిర్వహించారు. ఇందులో దేవికారాణి కవిత కవితా పురస్కారానికి ఎంపికైంది. ఈనెల 9వ తేదీన ఖమ్మంలోని జడ్పీ మీటింగ్ హాలులో జరిగే బహుమతి ప్రదానోత్సవంలో కవితా పురస్కారాన్ని బహూకరిస్తారు. స్థానిక జయప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కొలకలూరి దేవికారాణి, రూరల్ మండలం కొలకలూరులోని జిల్లాపరిషత్ హైస్కూలులో ఉపాధ్యాయినిగా చేస్తున్నారు. ప్రవృత్తి కవితా రచన. కవితల పోటీల్లో పలుసార్లు రాష్ట్రస్థాయి బహుమతులను స్వీకరించారు.

విలీనంతో కలవరం

- ప్రమాదం అంచున ఉర్దూ పాఠశాలలు
- తెలుగు మీడియంలో కలపడటంపై తల్లిదండ్రుల్లో ఆందోళన



వేములూరిపాడు పాఠశాలలో ఉర్దూ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఫిరంగిపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దారు. దాంతో పాటు ఉర్దూ బాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉర్దూ పాఠశాలల స్థితిగతులు మారనున్నాయి. నిబంధనల మేరకు 20 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది. కానీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయుల కొరత ఉంది. అంతేకాక ఉర్దూ పాఠశాలలను సమీపంలోని మరో తెలుగు మీడియం పాఠశాలలకు మోడల్ పాఠశాలల పేరుతో విలీనం చేస్తారనే సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విధానం ద్వారా ఉర్దూ భాష కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంటుందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఇప్పటికే పలు గ్రామాల్లోని ముస్లిం పెద్దలు, ఆయా పాఠశాలల చైర్మన్లు ఎంఈవో కార్యాలయం, ఉన్నతాధికారులకు విలీనం చేయొద్దంటూ వినతి పత్రాలు అందజేశారు.

మండలంలో పది పాఠశాలల్లో బోధన

మండలంలో ఏడు ప్రైమరీ, ఒక అప్పర్ ప్రైమరీ, ఒక గవర్నమెంట్ ప్రైమరీ, ఒక జెడ్పీ ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. గ్రామాల వారీగా ఫిరంగిపురంలో ఒకటి, అమీనాబాద్‌లో రెండు, వేములూరిపాడులో ఒకటి, 113 తాళ్లూరులో ఒకటి, మేరిగపూడిలో ఒకటి, మునగపాడులో ఒకటి, గుండాలపాడులో ఒకటి, బేతపూడిలో ఒకటి, పొనుగుపాడులో ఒక పాఠశాల ఉన్నాయి. వీటిల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 300 మంది వరకు విద్యార్థులు ఉర్దూ విద్యనుఅభ్యసిస్తున్నారు. వీటిలో అమీనాబాద్‌లో 6నుంచి 10వ తరగతి వరకు ఉన్నత విద్య బోధించే పాఠశాల ఉంది. మొత్తం పది పాఠశాలల్లో 28 మంది ఉపాధ్యాయులు ఉర్దూ భాషతో పాటు పలు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

తగ్గిపోనున్న పాఠశాలలు

మునగపాడు, గుండాలపాడు, బేతపూడి, పొనుగుపాడు, వేములూరిపాడు, 113 తాళ్లూరు వంటి ఆరు గ్రామాల్లో ఉన్న ఉర్దూ పాఠశాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయనున్నట్లు సమాచారంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల చైర్మన్లు, ముస్లిం పెద్దలు ఆందోళన చెందుతున్నారు. దీని ద్వారా ఉర్దూ భాష కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గనుండటంతో మరలా నూతనంగా తీసుకునే పరిస్థితి ఉంటుందోలేదోనని నిరుద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

వినతి పత్రాలు అందజేత

ఇటీవల ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం పెద్దలు, పాఠశాలల చైర్మన్లు స్థానిక ఎంఈవో కార్యాలయంలోనూ, ఎమ్మెల్యే కార్యాలయం, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వ నిర్ణయం ద్వారా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడతారని, ఉర్దూ భాష కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంటుందంటూ వినతి పత్రాలు అందజేశారు. కొన్నిచోట్ల మసీదు సమీపంలో స్థలాలు ఇచ్చి పాఠశాలలు కూడా నిర్మించారు.



ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంఘ పెద్దలు

ఉర్దూ భాషకు భవిష్యత్ ఉండదు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉర్దూ భాష కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంటుంది. విద్యార్థులకు భాష రాని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నిర్ణయం సరైనది కాదు. దీన్ని ప్రభుత్వం పునరాలోచించాలి.

–షేక్, ఫజుల్లా,
బేతపూడి ఉర్దూ పాఠశాల చైర్మన్

చదువుకు ఆటంకం



ఇప్పుడిప్పుడే విద్యార్థులు ఉర్దూ బాషను బాగా నేర్చుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం ద్వారా చదువుకు ఆటంకం కలుగుతుంది. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశాం. ప్రభుత్వం విలీనం చేయకుండా చూడాలి.

–షేక్,జాన్‌వలి,
గుండాలపాడు, ఉర్దూ పాఠశాల చైర్మన్

పాఠశాల తరలింపుతో అవస్థలు



నేను చిన్నతనంలో ఈ పాఠశాలలో ఉర్దూ నేర్చుకున్నాను. ఇక్కడి నుంచి మరో పాఠశాలకు తరలిస్తే ఇబ్బంది ఏర్పడుతుంది. వేరే పాఠశాలకు పంపించేకన్నా ఇంట్లోయినా కూర్చుబెట్టుకుంటాం.

– షేక్ నజీమా,
విద్యార్థి తల్లి, వేములూరిపాడు

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్



మంగళగిరిలో బడ్జెట్ పత్రాలను తగలబెడుతున్న నాయకులు

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే ఉపయోగపడేలా ఉందని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరసన తెలియజేస్తూ పత్రాలను తగలబెట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయరంగంతో అన్ని రంగాలను విస్మరించిన ప్రభుత్వం సామాన్యులపై భారం మోపుతోందని తెలిపారు. రైతు,కార్మిక, చేతి వృత్తిదారులను దగా చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం బడ్జెట్‌లో మాత్రం ఒక్క రూపాయి కేటాయించకపోవడం సిగ్గుచేటని ఖండించారు. రైతు, కార్మిక, చేతివృత్తిదారులతో పాటు అన్ని రంగాలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసేలా బడ్జెట్ తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు,యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, చిన్ని తిరుపతయ్య,అన్నవరపు ప్రభాకర్, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరిగిందంటూ సీపీఎం, సీఐటీయూ నాయకులు బుధవారం పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మస్తాన్‌వలి, సీపీఎం నాయకుడు మార్పుల వెంగళరెడ్డి, రంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ దుగ్గిరాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్. యోగేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జి. శ్రీనివాసరావు, సీహెచ్. పోతురాజు, నాగయ్య, రమాదేవి, పాములు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ప్రతుల దహనం

కుంచనపల్లిలో సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేకమని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.సూర్యనారాయణ అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్, ఉండవల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరికీ కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని రేపూడిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 168మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు షుగర్, బీపీ , థైరాయిడ్ పరీక్షలు చేశారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శాంతి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు చర్మం ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఎండీటీ మందులు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే మనిషి అభ్యున్నతి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ ఆధ్వర్యంలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ ప్రతినిధులు మాట్లాడుతూ మనిషి వ్యక్తిత్వ వికాసానికి, అభ్యున్నతికి చదువు ఆభరణమని తెలిపారు. విద్యతోనే మనిషి అభివృద్ధి చెందుతాడని వివరించారు. విద్యార్థులు అకుంఠిత దీక్ష, పట్టుదల, కఠోర శ్రమతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోవడానికి ఇష్టంతో కష్టపడితే విజయం వస్తుందని అన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీమతి లక్ష్మి, సాయి వరప్రసాద్, కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కోపల్లె-గుడివాడ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుం రూ. 5200 స్వాధీనం చేసుకున్నారు.

ద్విచక్ర వాహనంలో నగదు చోరీ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని పోలకంపాడులో ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టిన నగదును గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం దొంగిలించారు. నులకపేటలో నివాసముండే డిగ్రీ విద్యార్థి వంకాల యువరాజ్ ఎడ్యుకేషన్ లోన్‌కు దరఖాస్తు చేయగా 90 వేల రూపాయలు ఖాతాలో జమ అయ్యాయి. ఉండవల్లి సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసి ద్విచక్ర వాహనం డిక్కీలో భద్రపరిచాడు. మార్గం మధ్యలో పోలకంపాడు వద్ద ఆగి ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై పార్కింగ్ చేసి స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపల డిక్కీ తాళం తీసి సీటు తొలగించి అందులో ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితుడు యువరాజ్ తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొల్లిపరలో బోర్డు ప్రతినిధుల పర్యటన

కొల్లిపర(తెనాలి): భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధులు చిరాగ్, ఆదిత్య బుధవారం మండల కేంద్రమైన కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించారు. రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు, డ్రయర్లు ఏర్పాటు కోసం కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ బోర్డు బృందాలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నాయి. ఈ క్రమంలో చిరాగ్, ఆదిత్య బృందం గుంటూరు జిల్లాలో కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఎంచుకున్నారు. సంస్థ కలెక్షన్ సెంటరు, కోల్డ్ రూమ్, సోలార్ డ్రయర్, సభ్యుల పంటపొలాల్లోని సాయిల్ సెన్సార్‌లను పరిశీలించారు. వాటి పనితీరును స్వయంగా చూశారు. సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న పసుపు, అరటి పైర్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కోల్డ్ చైన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనపై కేంద్రప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వారు తెలియజేశారు. వీరితో జిల్లా ఉద్యాన అధికారి రవీంద్రబాబు, ఉద్యాన విస్తరణ అధికారి శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావు, శ్రేష్ఠ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలి

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త

తాడికొండ: కలిసి పనిచేద్దాం... రాబోయే ఎన్నికల్లో రాజధానిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరేద్దామని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు అన్నారు. బుధవారం తుళ్లూరు మండలం మందడంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజధాని ప్రాంతంలో వైఎస్సార్ సీపీకి ఆదరణ మరింత పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ అసమర్థ పాలన కారణంగా పేదలు ఇబ్బందుల్లో ఉన్నారనేందుకు వైఎస్సార్ సీపీపై ప్రజల్లో ఉన్న ఉత్సాహం చూస్తుంటే అర్థమవుతోందని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే పునాదులు అని, వారు చేసిన కష్టం ఎప్పటికీ వృథాగా పోదనేందుకు ప్రజల్లో వస్తున్న ఆదరణే నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అర్హులకు పదవులు కేటాయింపులు జరగనున్నాయన్నారు. ఇందులో పార్టీకోసం పనిచేసిన వారికి అందరి ఆమోదంతో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పదవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలు బాబు దగాకోరు పాలనలో మోసపోయి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా చుక్కలు చూపించడం ఖాయమని పేర్కొన్నారు. అమ్మఒడి, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్, రైతు భరోసా, రాయితీ విత్తనాలు, పండించిన పంటకు మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరలకు కొనుగోలు వంటి చర్యలు అటకెక్కడంతో అన్నదాతలు విలవిల్లాడుతున్నారని మండిపడ్డారు. నేడు మిర్చి, పత్తి, కంది, మినుము, పెసర, వరి పలు పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే అధికార పార్టీకి చీమకుట్టినట్లు లేకపోవడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిశోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, చుండు వెంకటరెడ్డి, ఆరేపల్లి జోజి, దానం వినోద్, మందడం గ్రామ నాయకులు ఆలూరి పెద శ్రీనివాసరావు, చిన్న శ్రీనివాసరావు, బేతపూడి రాజేంద్ర, దానం నాగేశ్వరరావు, బేతపూడి ప్రభాకర్, నందం రాజు, గడ్డం జయరావు, శ్రీ హరి, కొల్లేటి అనీల్ పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శనీయం



ప్రసంగిస్తున్న కేఎల్‌యూ విద్యార్థిని

తాడేపల్లి రూరల్: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చిరస్మరణీయమైన పాత్ర పోషించిన సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమని కేఎల్‌యూ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నేతాజీ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ నేతాజీ నిబద్ధత, ధైర్యసాహసాలతో దేశభక్తికి మారుపేరుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో బీసీఏ విభాగాధిపతి భగవాన్, అధ్యాపకులు జి.బి.వి. కిశోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. ఉషారాణి, కో ఆర్డినేటర్ పి. సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెల్లంకి శ్రీదేవి విద్యార్థినులకు, మహిళా అధ్యాపకులకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యానికి తోడు ఆధునిక జీవన శైలి కూడా నేటి తరంలో క్యాన్సర్ విజృంభించడానికి కారణమవుతోందని తెలిపారు. యుక్త వయసు నుంచే బాలికలు, మహిళలు తగినంత అవగాహనతో, జాగ్రత్తలు తీసుకుంటే దూరంగా ఉండొచ్చని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వీసీలు ఎ.వి.ఎస్. ప్రసాద్, కె. రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, అసోసియేట్ డీన్, కేఎల్ మహిళా డెవలప్‌మెంట్ కన్వీనర్ కె. రూతు రమ్య, కోకన్వీనర్ శ్రీలక్ష్మి, సీఎస్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ, ప్రాజెక్టు డైరెక్టర్లు సుమ పాల్గొన్నారు.

నవ గ్రహాలకు జలాధివాస పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలో కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా మొదటి రోజు పూజలను వేద పండితులు ప్రారంభించారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న నవగ్రహ దేవత విగ్రహాలు, జంట నాగేంద్రస్వామి, జీవ ధ్వజ స్తంభ, హరిహరమూర్తి, చండీశ్వర విగ్రహాలకు వేద పండితులు కాకుమాను ఆంజనేయశాస్త్రి, ఇంకొల్లు సుధీర్‌శాస్త్రి, రావూరిపూర్ణచంద్రశాస్త్రిలు పూజలు చేశారు. ఉదయాన్నే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, ప్రోక్షణ, ప్రాచీన కంకణధారణ దీక్ష, అఖండ స్థాపన, యంత్ర అనుష్టానములు, రుత్వీకరణ, యాగశాల ప్రవేశ పూజలు చేశారు. సాయంత్రం మండపంలో మృత్యుం గ్రహణ పూజలు చేసి అంకురారోహణం గావించారు. వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి కార్యక్రమాలు నిర్వహించి అగ్నిమథనం చేశారు. యాగశాలలో అగ్నిప్రతిష్ఠాపన హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠించే దేవతా విగ్రహాలకు జలాధివాస పూజలు చేసి నివేదన పెట్టారు. తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



శిబిరంలో మాట్లాడుతున్న దుర్గారావు

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు జరిపాలని కోరారు. ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం. ఆశీర్వాదం, యెహోషువ, సులోమన్, గురవయ్య, వై. సుబ్బారావు, సుబ్బారావు, అంకయ్య, శివకుమారి, కాశమ్మ, రిబ్కా, సారమ్మ పాల్గొన్నారు.

మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఓ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలేనికి చెందిన బాలిక డాన్‌బాస్కో స్కూల్‌లో చదువుతోంది. ఈ నెల ఒకటిన సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ బాలికను వెంబడించి అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో ఒకటో తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా, ఇతర సాక్ష్యాల ఆధారంగా నిందితుడు యర్రబాలేనికి చెందిన వెంకట్‌గా గుర్తించామని సీఐ తెలిపారు. అతను ఎయిమ్స్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్‌గా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించి, మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. నిందితుడిని జిల్లా జైలుకు తరలించామని తెలిపారు. సమావేశంలో యస్ఐ సీహెచ్. వెంకట్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.